క్లుప్తంగా

వైభవంగా గణపతి హోమం

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరులో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిత్యోపాసన హోమం, బలిహరణ, శ్రీ గణపతి హోమం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మ కర్తలు తాడికొండ శేషగిరిరివు ఆధ్వర్యంలో కుమారులు ప్రసన్న కుమార్ దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వామికి మహా పూర్ణాహుతి, మహా నివేదన, హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి రథాంగ హోమం అనంతరం స్వామి రథోత్సవం జరిపారు. భక్తులు పండ్లు, పూలు, టెంకాయలు, పసుపుకుంకుమలు సమర్పించారు. జై గణేష్....జై జై గణేష్ నామస్మరణతో రథోత్సవం కొనసాగింది. రుత్వికుడు కొతా రాజేష్ శర్మ హోమం నిర్వహించగా, పూజల్ని ఆలయ ప్రధాన అర్చకుడు క్రోవి శ్రీరామచంద్రమూర్తి శాస్త్రయుక్తంగా జరిపారు.

నేడు అద్దేపల్లిలో భావనారుషి కల్యాణం

భట్టిప్రోలు: స్థానిక పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి తిరువీధుల వారి శ్రీ సీతారామ మందిర ప్రాంగణంలో శనివారం శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామి నగరోత్సవం అనంతరం పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యుత్ మోటార్ల చోరీ

నగరం: మండలంలోని ఈదుపల్లి శివారులో రెండు విద్యుత్ మోటార్లను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు.రబీలో వేరుశనగకు నీటిని అందించేందుకు పొలాల్లో రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. రాత్రిపూట మోటర్లను అపహరించడంతో ఆందోళన చెందుతున్నారు. ఈదుపల్లి గ్రామానికి చెందిన తుమ్మల రామస్వామి, తాడివాకవారిపాలెం గ్రామానికి చెందిన గుడా రంకయ్య మోటార్లను అపహరించారని రైతులు పేర్కొంటున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



బాపట్ల అర్బన్ : మండలంలోని తూర్పు బాపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని హైదర్‌పేట నివాసి సమ్మెట చిరంజీవిరెడ్డి (66) ఈ నెల 19న రైలు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు అందించారు. కార్యక్రమంలో ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, మాజీ సర్పంచ్ పీటా వేణుగోపాల్, బొనిగల డేవిడ్ రాజు, మోర్ల సముద్రాలు గౌడ్, పీటా భాస్కరరావు, పీటా రవీంద్ర ప్రసాద్, మహిళా పోలీస్ సుప్రియ, ప్రేమకుమారి పాల్గొన్నారు.

నేడు సచివాలయాల ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని సాయిబాబా మందిర సమీపంలో నూతనంగా నిర్మించిన 8, 10వార్డుల సచివాలయాల్ని శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చేతుల మీదుగా ప్రారంభించే సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు పాండురంగడి ఆలయంలో ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్ : చీరాల రోడ్డులోని పాండురంగస్వామి దేవాలయంలో సర్వమానవాళి శ్రేయస్సు ఆకాంక్షిస్తూ భక్తుల గోత్ర నామాలతో ఉచితంగా ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు నెమలికంటి హనుమంతరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాష్టమి వ్రత పూజ, గులాబీ కుసుమార్చన, దుర్గా సూక్త హోమం జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలి

వేమూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో సునీత తెలిపారు. పోతుమర్రులో శుక్రవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలతో పాటు వసతులు కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. డ్వాకా సంఘాల ద్వారా అదనంగా రూ. 35 వేలు అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మైనా, ఎంపీటీసీ ఈపూరు కుసుమ కుమారి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అలేఖ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి

మంత్రి మేరుగ నాగార్జున



అమర్తలూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి లబ్ధిదారుల్ని అడిగి తెలుసుకున్నారు. అమర్తలూరులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం ప్రారంభంతో పాటు గ్రామంలో సిమెంట్ రోడ్డు శిలా ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలిపారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పేరిట జన్మభూమి కమిటీలు ప్రజలు సొమ్ము దోచుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయినేజీ, రోడ్లు తదితర సమస్యల్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, చందోలు డేవిడ్ విజయకుమార్, కో–ఆప్షన్ మెంబరు అరమండ మాణిక్యం, గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, యలవర్తి సురేష్, చదలవాడ రమేష్ , షేక్ హుస్సేన్, ఎంపీటీసీ రాపర్ల వల్లీకరాణి, దోమ రవీంద్ర, బర్మా ప్రవీణ్‌కుమార్, కొండముది భాస్కర్, పోతార్లంక సురేష్, నూతక్కి శంకరావు, వార్డు మెంబరు కల్యాణ్, ఇంటూరు మోషే, పెదపూడి ఆనందబాబు, మానుకొండ దానియేలు, అమర్తలూరు వెంకయ్య, అంబటి రామోహనరావు, గొళ్లపూడి అశోక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



భట్టిప్రోలులో సచివాలయాల ఉద్యోగులకు సన్మానం



కలెక్టర్ , ఎస్పీ నుంచి అవార్డులు అందుకున్న కర్లపాలెం మండల అధికారులు



అర్జునరావును అభినందిస్తున్న సిబ్బంది

భట్టిప్రోలు: గణతంత్ర దినోత్సవంలో భాగంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన మండలంలోని వివిధ సచివాలయాల్లో 12 విభాగాలకు చెందిన ఉద్యోగుల్ని శుక్రవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి సన్మానించి వారి సేవల్ని కొనియాడారు. సన్మానం అందుకున్న వారిలో ఎన్ఆర్ఈజీఎస్ జేఈ అండ్ఏపీవో జి. జయచంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి అడిగోపుల చినవెంకటేష్‌బాబు, వీఆర్వో ఎస్‌కే నజరున్నీస్సా, గ్రామ సర్వేయర్ జె. రాంబాబు, డిజిటల్ అసిస్టెంట్ ఆర్ వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ ఎస్. సుధా మాధురి, వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ జోషిబాబు, హెల్త్ అసిస్టెంట్ పీబీ తులసి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బి. శివకృష్ణ, ఎనర్జీ అసిస్టెంట్స్ ఎ. సాయికుమార్, జి. సైడిరాజు, వెటర్నరి అసిస్టెంట్ మురాల గాయిత్రీ ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఈవోపీఆర్డీ సీహెచ్. శేఖర్, మండల సమాఖ్య ఏపీఎం కొండూరు శోభన్, సూపరింటెండెంటు సీహెచ్. జలజ, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పి. సుధీర్ కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మందికి ఉత్తమ సేవా అవార్డులు

కర్లపాలెం: గణతంత్ర దినోత్సవంలో భాగంగా కర్లపాలెం మండలంలోని ఎనిమిది మంది అధికారులు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన వేడుకల్లో కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా కర్లపాలెం పంచాయతీ వీఆర్వో సీహెచ్. చంద్రశేఖర్, ఎనర్జీ అసిస్టెంట్ యారం చిన్నబ్బాయి, క్లాప్ మిత్ర బొంతా సుజాత, దమ్మనవారిపాలెం పంచాయతీ కార్యదర్శి మామిడాల గాయత్రి, పాతనందాయపాలెం గ్రామ సర్వేయర్ షేక్ జాకీర్ హుస్సేన్, చింతాయపాలెం మహిళా పోలీస్ సోమన వసుంధర, పెదపులుగువారిపాలెం ఏఎన్ఎం ఎం.ప్రసన్న, బుద్ధాం అగ్రికల్చర్ అసిస్టెంట్ సయ్యద్ బాజీ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎంపీడీవో ఎలీషాబాబు, తహసీల్దార్ కేశవనారాయణరావు అభినందించారు.

విద్యుత్ ఏఈ అర్జునరావుకు అభినందనలు

చుండూరు(వేమూరు): గణతంత్ర వేడుకల సందర్భంగా మండలంలో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీరు దోనేపూడి అర్జునరావుకు జిల్లా బెస్ట్ అవార్డును చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మజాజనార్దన్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అర్జునరావుకు విద్యుత్‌శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు. సిబ్బంది కృషి వల్లే తనకు జిల్లా బెస్ట్ అవార్డు దక్కినట్లు ఆయన చెప్పారు.

కూలీల రక్షణ బాధ్యత ఇటుక ఉత్పత్తిదారులదే..



ఇటుక ఉత్పత్తిదారులతో కూలీల సౌకర్యాలపై చర్చిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొల్లూరు : ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు రక్షణాత్మక వసతి కల్పించాల్సిన బాధ్యత ఇటుక ఉత్పత్తిదారులదేనని కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. పోతార్లంక సమీపంలో వలస కార్మికుల తాటాకు పాకలు దగ్ధమై, దంపతులు గాయాలపాలైన నేపథ్యంలో ఇటుక బట్టీల నిర్వాహకులతో ఆయన శుక్రవారం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా మండలంలోని పెసర్లంక, కొల్లూరు, గాజుల్లంక, ఆవులవారిపాలెం, పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న ఇటుక పరిశ్రమల్లో కూలీలకు ఏర్పాటు చేసిన తాటాకు పాకలు తొలగించి గోడలతో పాటు రేకుల పైకప్పుతో నివాసాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోతార్లంకలో సంభవించిన తరహాలో మరలా ప్రమాదాలు జరిగితే ఇటుక ఉత్పత్తిదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తాటాకు పాకల్ని వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామని తెలిపారు. సమావేశంలో కొల్లూరు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బొప్పర సుబ్బారావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు హౌసింగ్ ఏఈగా సౌమ్య



భట్టిప్రోలు: హౌసింగ్ ఏఈగా రావూరి సౌమ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె బాపట్ల హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి భట్టిప్రోలుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రామమోహన్‌రావు మంగళగిరి డీఈగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

సీసీ రహదారులకు శంకుస్థాపన

రేపల్లె రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య తెలిపారు. మండలంలోని కై తేపల్లిలో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి రూ.20లక్షలు మంజూరయ్యాయని, వీటితో గ్రామంలో మూడు సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

బాపట్ల టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రామానగర్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న కొక్కిలిగడ్డ పరంధామయ్యను అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రత్నప్రసాద్

చెరుకుపల్లి: వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహన సేవల్ని పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ సూచించారు. చెరుకుపల్లి, నగరం మండలాలకు కొత్తగా మంజూరైన వాహనాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు ఆరోగ్య సమస్య తలెత్తి వైద్యశాలకు వెళ్లలేని పరిస్థితి ఎదురైతే వెంటనే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే వాహన సిబ్బంది రైతు ఇంటి వద్దకే వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీ నాగుల నరసింహారావు, ఎల్లెల రవికిరణ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, నగరం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, స్థానిక పశువైద్యాధికారి ఎం .వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినులకు నగదు బహుమతుల అందజేత



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

జంపని(వేమూరు): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతుల్ని ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు హెచ్ఎం బద్రి నారాయణ తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గత ఏడాది పాఠశాలో చదివిన టెన్త్ విద్యార్థినులు షేక్ అపామ్మీ, ఆలపాటి కావ్య, అలూరు వినీత అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. వేమూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయకుమారి వారికి నగదు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ



షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రేపల్లె రూరల్: రైతులకు నాణ్యత కూడిన ఎరువులు, పురుగు మందుల్ని అందించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.శ్రీహరి చెప్పారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసి రకాల్ని, కాలం చెల్లిన వాటిని విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. స్టాక్ బోర్డులో ఆయా వస్తువుల ధరలు, స్టాక్ వివరాలను ఎప్పటిప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని పలు దుకాణాలలో రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ఎమ్మార్పీని మించి విక్రయిస్తున్న నాగేంద్రం అండ్ కో దుకాణంపై 6–ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈఈ శ్రీమన్నారాయణ, ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఎఫ్ఆర్‌వో సైదులు పాల్గొన్నారు.

చిత్రసీమకు జమున సేవలు ఎనలేనివి



జమునకు నివాళులర్పిస్తున్న రసాలయ కళా సమితి సభ్యులు

రేపల్లె: చిత్రసీమకు జమున సేవలు ఎనలేనివని రసాలయ కళాసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్ కొనియాడారు. సినీనటి జమున మృతికి సంతాపంగా పట్టణంలోని రసాలయ కళా సమితి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పాత్రకు జమున జీవం పోసేవారని తెలిపారు. మిసమ్మ, శ్రీకృష్ణతులాభారం, మూగమనసులు వంటి అనేక మణిపూసలు ఆమె ఖాతాలో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మల్లెల రామచంద్రరావు, శింగం వరప్రసాద్, వై.బుచ్చిరావు, మేకా రామకృష్ణ, కొల్లూరు వాసు, మృత్యుంజయరావు, భవానీ శంకర్, ఎం.నారాయణమూర్తి, నటరాజ్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు ప్రభుత్వ సంక్షేమ ఫలాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్:సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం, కొత్త కంకటపాలెం గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల్ని వివరించి, లబ్ధిదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, వాటిని పరిష్కరించేందుకే ప్రజల వద్దకు వచ్చానని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్ని వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా.. లేదా? అని ఆరా తీశారు. సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్ల పట్టాల సమస్యల్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. సీఎం జగన్ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారని, పార్టీలు, రాజకీయాలకు, కులాలకతీతంగా సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని వివరించారు. టీడీపీ నాయకులు ఓర్వలేకనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతల హరిబాబు, వడ్డి ముక్కల డేవిడ్ , సర్పంచ్ కుంచాల గోవిందమ్మ, ఎంపీడీవో గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి విజయ సారథి, ఆట్ల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పన్ను వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీపీఓ



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ శంకర్ నాయక్

పిట్టలవానిపాలెం: ఇంటి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శంకర్ నాయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఇప్పటి వరకు పన్ను వసూళ్లపై అసంతృప్తి వ్యక్త చేశారు. ఫిబ్రవరి 15 తేదీ నాటికి నూరు శాతం చేయాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలని సూచించారు. దీన్ని అమ్మి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని సూచించారు. పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెత్త సేకరణకు ఆటో ఉందని, అయితే రోజూ నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు వేయడం వల్ల ఖర్చు అధికంగా అవుతోందని, ట్రాక్టర్ ఇప్పించాలని కార్యదర్శి ఐనంపూడి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజీ, ఎంపీడీఓ కె.పద్మజ, కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, దాసరి శివకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైస్కూలుకు రూ. 2 లక్షల విరాళం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శేరు శ్రీనివాసరావు

పల్లెకోన(భట్టిప్రోలు): తాను చదువుకున్న కారుమూరు-పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూలుకు మండలంలోని పల్లెకోనకు చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావురూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. హైస్కూలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన డిపాజిట్‌ను హెచ్ఎం వి. నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డిపాజిట్‌పై వచ్చే వడ్డీతో ఏటా ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయాలని కోరారు. హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇదే విధంగా ప్రతి ఒక్కరూ ఉడతాభక్తిగా సాయాన్ని అందిస్తే ప్రతిభ కలిగిన విద్యార్థుల్ని ప్రోత్సహించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులు రాఘవరావు, విద్యాసాగర్ అందించిన బహుమతుల్ని అతిథులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వేపూరి శివనాగు, బొల్లెద్దు ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి వీవీడీవీ ప్రసాద్, పాల్గొన్నారు.

10న కావూరు కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనం పోస్టరులను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చెరుకుపల్లి: వచ్చే నెల 10న కావూరు కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. కళాశాల ఆవరణలో శుక్రవారం సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు పిట్టు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి, డాక్టస్ సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ సౌజన్యంతో సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇటీవల జరిగిన వివిధ పోటీల్లో విజేతలైన 35మందికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. సమ్మేళనానికి పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు రావూరి ఆంజనేయులు, గడ్డిపాటి శ్రీనివాసరావు, బొనిగల విజయ్ కుమార్, దివి రాంబాబు, పీటా ప్రసాద్, కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషన్ డే



ఎలక్ట్రిషన్ డే జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ విద్యుత్ శాఖ ఏడీఏ, ఏఈలు

బాపట్ల టౌన్: పట్టణంలోని పెయింటర్స్ కాలనీలో శుక్రవారం ఎలక్ట్రిషన్ డే ఘనంగా నిర్వహించారు. తొలుత కాలనీలోని ఎలక్ట్రిషన్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ఏడీఈ బి. హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. పట్టణ ఏఈ పెరుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ 1880 జనవరి 27న బల్బును తయారుచేసి ఆరోజు పేటెంట్ పొందారని చెప్పారు. అప్పటి నుంచి వెలుగుల నీడలో అందరం బతుకుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎలక్ట్రీషియన్ ఎం. శ్రీధర్, రవిబాబు, జి. సామ్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శేషాచార్యులు, ఉపాధ్యక్షుడు ఒంగోలు రాఘవేంద్రరావు, కార్యదర్శి గుమ్మలపూడి శివప్రసాద్, ఉప కార్యదర్శి వాకా వినోద్, కోశాధికారి బోయిన మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఎం. శ్రీధర్, ముఖ్య సలహాదారు తిరుమలశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

కర్లపాలెం: ప్రభుత్వ భవనాల నిర్మాణం పనులు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలతో భవనాల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయం భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల్ని వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో మంజూరైన గృహాల నిర్మాణం వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనుల్ని వెంటనే ప్రారంభించే విధంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆయన సూచించారు. హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో మండలానికి 246 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందులో 67 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన వాటిని కూడా ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.